సాక్షి మెదక్

మంగళవారం ౹ 29 ౹ జూలై ౹ 2025



బందీ అయిన బాల్యం !

బడిలో చదువుకుంటూ సరదాగా గడపాల్సిన చిన్నారుల బాల్యం పనుల్లో బందీ అవుతోంది.

వివరాలు 8లో ▸



నవోదయలో ప్రవేశాలు

వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయంలో 2026–27 విద్యాసంవత్సరానికి నోటిఫికేషన్ వెలువడింది.

వివరాలు 8లో ▸

మల్లన్న ఆలయంలో ఆడిట్

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జునస్వామి ఆలయంలో 2024–25 సంవత్సరానికి సంబంధించిన ఆదాయ వ్యయాలపై ఆడిట్ ప్రారంభమైంది. జిల్లా ఆడిట్ అధికారి జయలక్ష్మీ ఆధ్వర్యంలో సోమవారం కొనసాగింది. ఈ ఆడిట్ నాలుగు రోజులపాటు కొనసాగనున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

న్యూస్‌రీల్

బాధితులకు పునరావాసం కల్పించండి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు తదితరులు

సంగారెడ్డి జోన్: భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఇక్రిశాట్ ఫెన్సింగ్ ప్రాంతంలో ఎంఎంటీఎస్ రైల్వేలైన్ నిర్మాణం నేపథ్యంలో నివాస గృహాలు కోల్పోయిన బాధితులకు పునరావాసం కల్పించాలని మాజీ మంత్రి హరీశ్‌రావు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో కార్పొరేటర్ సింధుతో కలిసి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్లు కోల్పోయిన సుమారు 218 కుటుంబాలు పునరావాసం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఇతర ప్రాంతాల్లో నిర్వాసితులకు ఇళ్లు కేటాయించినా, ఈ ప్రాంతంలోని 218 కుటుంబాలకు మాత్రం ఇప్పటికీ కేటాయించకపోవడం బాధాకరమన్నారు. వెంటనే బాధితులకు న్యాయం చేయాలన్నారు.

ఐక్య పోరాటాలతోనే హక్కుల సాధన



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాములు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: కార్మికులు ఐక్యంగా పోరాడితేనే హక్కులు రక్షించుకుంటామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు అన్నారు. సోమవారం సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో నిర్వహించిన పారిశ్రామిక యూనియన్ల నాయకత్వ స్థాయి ట్రేడ్ యూనియన్ తరగతులకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని ప్రభుత్వం కార్మి కుల సంక్షేమం పట్టించుకోకుండా కార్పొరేట్లకు ఊడిగం చేస్తుందన్నారు. నిత్యావసర ధరలు పెరిగినా కార్మికుల వేతనాలు మాత్రం పెరగలేదన్నారు. రాష్ట్రంలో 8 గంటల పని విధానాన్ని 10 గంటలకు పెంచటం, మహిళలతో రాత్రివేళ పనిచేయించే అవకాశం కల్పించటం వంటివి లేబర్ కోడ్ అమలులో భాగమేనని వివరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, సాయిలు, నాయకులు రాజయ్య, మాణిక్యం, పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం




చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జడ్జి కవితాదేవి

జహీరాబాద్: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి కవితాదేవి అన్నారు. సోమవారం మండలంలోని బూచనెల్లిలో గల మైనారిటీ బాలికల వసతి గృహంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చదువుతో పాటు సాధారణ చట్టాలపై అవగాహన కలిగి ఉన్నప్పుడే నిత్య జీవితంలో చిన్న చిన్న సమస్యలు పరిష్కరించుకునేందుకు దోహదపడుతుందన్నారు. సమస్యలు ఎదురైతే వాటిని ఎలా అధిగమించడానికి చట్టాలు తోడ్పడతాయని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్, లీగల్ సర్వీసెస్ సిబ్బంది, పారా లీగల్ వలంటీర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

నర్సాపూర్ రూరల్: ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు సాధించవచ్చని జిల్లా ఉద్యానవనశాఖ అధికారి ప్రతాప్‌సింగ్ రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని అచ్చంపేటలో ఓ రైతు పొలంలో లీఫ్ పామ్ రిసోర్స్ కంపెనీ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తక్కువ పెట్టుబడితో రైతులు తమ భూముల్లో ఆయిల్‌పామ్ సాగు చేసి అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ప్రభుత్వం సబ్సిడీ సైతం ఇస్తుందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లీఫ్ ఫాం రిసోర్స్ కంపెనీ మేనేజర్ కృష్ణ, ఏఈఓ దుర్గాప్రసాద్, ఇతర అధికారులు రైతులు పాల్గొన్నారు.

బదిలీలు లేకుండా పదోన్నతులా..!



రెండు, మూడు రోజుల్లో ప్రమోషన్ల షెడ్యూల్

- భాషా పండితులు, పీఈటీలకు స్కూల్ అసిస్టెంట్ హోదా
- ఇప్పటికే 261 టీచర్ల సర్దుబాటు.. బదిలీలు అనుమానమే!
- కోర్టుకెళ్లే యోచనలో జీహెచ్‌ఎంలు

ఉపాధ్యాయుల పదోన్నతి పంచాయితీ రాజుకుంటుంది. బదిలీలు లేకుండా ప్రమోషన్లు ఇస్తే, కుటుంబాలకు వందల కిలో మీటర్ల దూరంలో విధులు నిర్వర్తిస్తున్న తమకు తీరని అన్యాయం జరుగుతుందని గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అవసరమైతే కోర్టుకు వెళ్లేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే టీచర్ల సర్దుబాటు నిర్వహించిన సర్కార్, ఇక బదిలీలు చేయడం అనుమానమేనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. కాగా పదోన్నతులతో పాటు పీఈటీ, భాషా పండితులకు స్కూల్ అసిస్టెంట్ హోదా కల్పించేందుకు విద్యాశాఖ సిద్ధమవుతుంది. ఇక జిల్లాలో 22 జీహెచ్‌ఎం, 181 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 35 భాషా పండిత్, 9 పీఈటీ పోస్టులు అప్‌గ్రేడ్ అయ్యే అవకాశం ఉంది.

– పాపన్నపేట(మెదక్)

మల్టీజోన్ పదోన్నతితో కష్టాలు

పదోన్నతుల నిర్ణయం తీయని కబురే అయినా, బదిలీలు లేని ప్రమోషన్లు ప్రస్తుత జీహెచ్‌ఎంలకు చేదు మాత్రగా మారుతున్నాయి. జీహెచ్‌ఎం మల్టీజోన్ పోస్టు కావడంతో, మల్టీజోన్– 1 కింద 18 జిల్లాలు వస్తాయి. అంటే జీహెచ్‌ఎంగా పదోన్నతి పొందిన వారు, ఈ 18 జిల్లాల పరిధిలో ఎక్కడికైనా వెళ్లాల్సి ఉంటుంది. 2023లో జీహెచ్‌ఎం ప్రమోషన్లు ఇచ్చారు. మెదక్ జిల్లాకు 66 మంది ప్రమోషన్‌పై వస్తే, అందులో సుమారు 50 మందికిపైగా ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారే ఉన్నారు. ఖమ్మం, వరంగల్, కరీంనగర్, పెద్దపల్లి, మంచిర్యాల తదితర జిల్లాల నుంచి వచ్చి జిల్లాలో పని చేస్తున్నారు. తమ కుటుంబాలకు దూరంగా.. భారంగా గడుపుతున్నారు. ప్రమోషన్లకు ముందు బదిలీలు చేస్తే, కొంతమంది అయినా సొంత జిల్లాలకు, దగ్గరి ప్రాంతాలకు వెళ్లే అవకాశం ఉంటుందని ఆశ పడుతున్నారు. అయితే జీహెచ్‌ఎంలు బదిలీ దరఖాస్తు చేసుకోవాలంటే ఒక పాఠశాలలో కనీసం 2 ఏళ్ల సర్వీస్ ఉండాలి. గతంలో 2023 సెప్టెంబర్‌లో ప్రమోషన్లు ఇచ్చినందున, సెప్టెంబర్ 2025లో వీరు బదిలీ దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. అందుకే జీరో సర్వీసు నిబంధనతో బదిలీలు చేయాలని, అనంతరమే ప్రమోషన్లు ఇవ్వాలని కోరుతున్నారు. సాధారణంగా జీహెచ్‌ఎం ప్రమోషన్లు రిటైర్‌మెంట్ ముందర వస్తుంటాయని, ఈ వయసులో అనారోగ్య సమస్యలు, వయో భారపు ఇబ్బందులు ఉంటాయని, అందువల్ల తమ కుటుంబాలకు దగ్గరగా ఉండే అవకాశం కల్పించాలని కోరుతున్నారు. విద్యాశాఖ స్పందించకుంటే కోర్టుకు వెళ్లే యోచనలో ఉన్నట్లు తెలుస్తుంది. గతంలో బదిలీలు చేసిన తర్వాతనే ప్రమోషన్లు ఇచ్చే వారని అంటున్నారు.

కోర్టును ఆశ్రయిస్తాం



ప్రమోషన్లు ఇవ్వడం అందరికీ తీపి కబురే. కానీ మొదట బదిలీలు నిర్వహించిన తర్వాతే ప్రమోషన్లు ఇవ్వాలి. ఇప్పటికే జిల్లాలో సుమారు 100 నుంచి 450 కి.మీ దూరం నుంచి వచ్చి హెచ్‌ఎంలు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులో చాలా మంది 55 ఏళ్లు దాటిన వారు, రిటైర్‌మెంట్‌కు దగ్గరగా ఉన్నవారు ఉన్నారు. కనుక మానవీయతతో ఆలోచించాలి. లేకుంటే న్యాయస్థానాలను ఆశ్రయించే అవకాశం ఉంది.

– మధుమోహన్, జిల్లా జీహెచ్‌ఎం యూనియన్ అధ్యక్షుడు

పక్షవాతంతో బాధపడుతున్నా..



నాది ఖమ్మం జిల్లా భద్రాచలం. పిల్లలు, కుటుంబం అక్కడే ఉంటున్నారు. సుమారు 400 కి.మీ నుంచి కొడుపాకకు ప్రమోషన్‌పై వచ్చా. 5 ఏళ్లుగా పక్షవాతంతో బాధపడుతున్నా. మనిషి తోడు లేనిదే ఉండలేను. ఎల్లప్పుడు వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉండాలి. పని మనిషి సహాయంతో జీవితం కొనసాగిస్తున్నాను. నెలకు రూ. 20 వేలు ఖర్చు చేసి మెదక్ నుంచి కారులో కొడుపాకకు వెళ్లి వస్తుంటాను. ప్రమోషన్లు ఇచ్చే ముందు జీరో సర్వీసు పెట్టి, బదిలీలు నిర్వహించాలి.

– ఆరోగ్యం, జీహెచ్‌ఎం, కొడుపాక ఉన్నత పాఠశాల

అర్జీలు పెండింగ్‌లో ఉండొద్దు

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- ప్రజావాణిలో వినతుల స్వీకరణ



ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్: అర్జీలను పరిష్కరించడంలో వివిధ శాఖల అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ వా రం వచ్చే వినతులను అధికారులు ఎప్పటికప్పుడు ప్రాధాన్యతా క్రమంలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. మొత్తం 120 అర్జీలు రాగా, అందులో 50 భూ సమస్యలపైనే రావడం విశేషం. వీటితో పాటు పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజలు ఫిర్యాదులు అందజేశారు. వాటిని పరిశీలించిన కలెక్టర్ త్వరితగతిన పరిష్కారం చూపి ప్రజలకు జవాబు చెప్పాలని ఆదేశించారు. మెదక్ మండల పరిధిలోని రాయిన్‌పల్లి శివారులో 365 ఎకరాల వ్యవసాయ భూములను కొంతమంది కబ్జా చేసినట్లు బుడగ జంగాల కుటుంబాలు ఫిర్యాదు చేశారు. అలాగే చేగుంటకు చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు తమకు ఉచిత ఇసుకకు అనుమతి ఇప్పించాలని కోరారు. గత డిసెంబర్ నుంచి బిల్లులు రావడం లేదని, వెంటనే మంజూరు చేయించాలని మధ్యాహ్న భోజన కార్మికులు కోరా రు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్‌ఓ భుజంగరావు, జెడ్పీసీఈఓ ఎల్లయ్య పాల్గొన్నారు.

పదేళ్లుగా తిరుగుతున్నా..



మూడెకరాల భూమికి పట్టాదార్ పాస్‌పుస్తకం కోసం పదేళ్లుగా తిరుగుతున్నా. ధరణి వచ్చినప్పుడు కొత్త పాస్‌బుక్‌లు ఇచ్చారు. కానీ మాకు రాలేదు. ఇప్పటికీ కాస్తులోనే ఉన్నాం. నాటి నుంచి నేటి వరకు కలెక్టర్లకు ఫిర్యాదులు అందజేస్తున్నా.. పరిష్కారం చూపడం లేదు. వారం రోజుల్లో సమస్య పరిష్కరించకుంటే కలెక్టరేట్‌లోనే బైఠాయిస్తా.

– లక్ష్మి, చేగుంట మండలం చందంపేట

ఇళ్ల నిర్మాణంలో పురోగతి సాధించాలి

టేక్మాల్(మెదక్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో పురోగతి సాధించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. సోమవారం మండలంలోని ఎలకుర్తి, దనూర గ్రామాల్లో పర్యటించి ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... త్వరితగతిన ఇళ్లు నిర్మించుకోవాలని, ప్రభుత్వం బిల్లులు వెంటనే మంజూరు చేస్తుందన్నారు. అనంతరం ఫ్రైడే, డ్రైడే నిర్వహణ తీరును పరిశీలించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రూ. 5 లక్షలు సరిపోతాయా?

- ఇందిరమ్మ ఇళ్ల పథకంపై కేంద్ర బృందం ఆరా
- పెద్దకంజర్లలో పర్యటన

పటాన్‌చెరు టౌన్: మండలంలోని పెద్దకంజర్ల గ్రామంలో సోమవారం జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ (ఎన్‌ఆర్‌ఎల్‌ఎం) బృందం పర్యటించింది. సభ్యులు సృజన్, సయ్యద్ అలీ నేతృత్వంలోని బృందం గ్రామంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించింది. జాతీయ ఉపాధి హామీ పథకం అమలు, జాబ్ కార్డులు.. తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఏడాదిలో ఎన్ని రోజులు పని ఇచ్చారనేది రాసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్లకు 44 దరఖాస్తులకు ఆమోదం వచ్చిందని ఎంపీడీఓ యాదగిరి వారికి వివరించారు. వారిలో 16 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం అయ్యాయని హౌసింగ్ ఏఈ నందిని తెలిపారు. లబ్ధిదారులకు ప్రభుత్వం ఇచ్చే రూ. 5 లక్షలు సరిపోతాయా.? అని బృందం సభ్యుడు సృజన్ ప్రశ్నించారు. సరిపోవని, లబ్ధిదారులకు సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్ ద్వారా రూ. లక్ష రుణం అందేలా చూస్తున్నామని తెలిపారు. రూ. 8 లక్షల వరకు ఖర్చు వస్తుందని లబ్ధిదారులు తెలిపారని అధికారులు వివరించారు. అనంతరం కేంద్ర బృందం గ్రామస్తులతో మాట్లాడి వివరాలు సేకరించింది. కార్యక్రమలో పంచాయితీరాజ్ ఏఈ సంపత్, ఏపీఎం శ్రీనివాస్, ఏపీఓ సంతోష్ పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం

నేడు ఆర్టీఐ కమిషనర్ల రాక

మెదక్ కలెక్టరేట్: రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్లు మంగళవారం కలెక్టరేట్‌కు రానున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకుంటారని, ఈసందర్భంగా ప్రజావాణి హాలులో సమాచార హక్కు చట్టంపై పీఐఓలతో సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం సమాచార హక్కు చట్టం కేసుల పరిశీలన చేస్తారన్నారు. మధ్యాహ్నం 1 గంటకు పీఐఓలతో సమావేశం, అనంతరం ఆర్టీఐపై ప్రజెంటేషన్, కేస్ స్టడీస్ గురించి చర్చ ఉంటుందన్నారు. మధ్యాహ్నం అప్పీళ్లు, ఫిర్యాదులపై విచారణ చేస్తారని వివరించారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

సదాశివపేట(సంగారెడ్డి): ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ. 5 లక్షలు మంజూరు చేస్తుందని హౌసింగ్ డీఈ మాధవరెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని శ్రీ కృష్ణ నగర్ కాలనీలో ఇందిరమ్మ గృహ నిర్మాణాలకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై నేరుగా సంప్రదించండి

- ప్రజలకు ఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి సూచన
- బాధ్యతల స్వీకరణ

నారాయణఖేడ్: సమస్యలపై ఖేడ్ డివిజన్ పరిధిలోని ప్రజలు తనను నేరుగా సంప్రదించి పరిష్కరించుకోవాలని, వినతిపత్రాలు, ఫిర్యాదులు అందజేయవచ్చని సబ్ కలెక్టర్ ఉమాహారతి సూచించారు. ఖేడ్ ఆర్డీఓ కార్యాలయంలో సబ్ కలెక్టర్‌గా సోమవారం బాధ్యతలు స్వీకరించి విలేకరులతో మాట్లాడారు. తాను వికారాబాద్‌లో శిక్షణపొందగా, శిక్షణలో భాగంగా వెనుకబడిన ప్రాంతాల సమస్యలను పరిశీలించానని తెలిపారు. వెనుకబడిన ఈ ప్రాంతానికి సబ్ కలెక్టర్‌గా నియామకమై అభివృద్ధికి పాటుపడే అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. డివిజన్ పరిధిలోని సమస్యలు, ప్రజల అవసరాలను క్షుణ్ణంగా తెలుసుకొని ప్రభుత్వ ప్రాధాన్యతల ప్రకారం పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పిల్లల డ్రాపౌట్లు లేకుండా చూస్తామన్నారు. ప్రాంత అవసరాలు, సమస్యలపై అధ్యయనం చేసి అందుకనుగుణంగా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కాగా సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఉమా హారతిని ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఆర్డీఓ అశోకచక్రవర్తి, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, డీఎస్పీ వెంకట్‌రెడ్డి సన్మానించి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. ఆర్డీఓ కార్యాలయ అధికారులు, డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు, వివిధపార్టీల నాయకులు, ప్రజా సంఘాల బాధ్యులు సన్మానించారు.



సబ్ కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

సింగూరుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. సోమవారం 1,860 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో చేరింది. గత పది రోజులుగా డ్యాంలోకి ప్రతి రోజు ఇన్‌ఫ్లో చేరుతుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 19.762 టీఎంసీల నీటి నిల్వ ఉందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం డ్యాం నుంచి తాగు, సాగు నీటికి 633 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

మహా గర్జనకు తరలిరండి



మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

మెదక్ మున్సిపాలిటీ: దివ్యాంగుల సమస్యలపై ఆగస్టు 13న హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించే మహా గర్జన సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఓ గార్డెన్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహాక సభకు హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దివ్యాంగులను మోసం చేశారని మండిపడ్డారు. ఎన్నికల మేనిఫెస్టోలో పెన్షన్ పెంచుతామని హామీ ఇచ్చి, 20 నెలలు గడిచినా పెన్షన్ పెంచలేదన్నారు. దీంతో దివ్యాంగులు రూ. 20,000 కోట్లు నష్టపోయారని ఆరోపించారు. రైతులకు రుణమాఫీ చేసిన డబ్బులు దివ్యాంగులకు సంబంధించినవేనని అన్నారు. పేద వర్గాల డబ్బులు దోచి భూమి ఉన్నవర్గాలకు రేవంత్ రెడ్డి దోచిపెట్టాడని విమర్శించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జి దండు శంకర్, ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి విజయ్, సైదులు, చెట్లపల్లి యాదగిరి, మురళి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

అదనపు ఎస్పీ మహేందర్

మెదక్ మున్సిపాలిటీ: జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం జిల్లాస్థాయి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అదనపు ఎస్పీ మహేందర్ పాల్గొని ప్రజల నుంచి 18 వినతులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ప్రజావాణి నిర్వహించినట్లు తెలిపారు. ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు సూచించారు. శాంతి భద్రతలను పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్‌శాఖ పని చేస్తుందన్నారు. ప్రజా సమస్యలపై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ పరిష్కరిస్తున్నట్లు చెప్పారు.



బాధితులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ మహేందర్

చిన్నారులకు పాలు, అల్పాహారం!

- అంగన్‌వాడీలో ఉదయం అందించేలా చర్యలు
- కసరత్తు చేస్తున్న ప్రభుత్వం
- జిల్లాలో 20,244 మందికి లబ్ధి

అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు మరింత బలవర్ధకమైన ఆహారం ఇచ్చే విషయమై మాతా, శిశు సంక్షేమశాఖ కసరత్తు చేస్తుంది. వారిలో రక్తహీనత, పోషకాహార లోపం తలెత్తకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తుంది. ఇందులో భాగంగా ప్రస్తుతం వారికి ఇస్తున్న పోషకాహారానికి తోడు ఉదయం పాలు, అల్పాహారం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో జిల్లాలోని 20,244 మంది చిన్నారులకు లబ్ధి చేకూరనుంది.

– రామాయంపేట(మెదక్)

జిల్లాలో 1,076 అంగన్‌వాడీ కేంద్రాలుండగా, 5,0030 మంది విద్యార్థులున్నాయి. వీరిలో ఏడు నెలల నుంచి మూడేళ్ల లోపు చిన్నారులు 29,786 మంది ఉండగా, వీరికి టీహెచ్‌ఆర్ (టేక్ హోం రేషన్) కింద నెలకు 16 కోడిగుడ్లతో పాటు రెండున్నర కిలోల బాలామృతం ప్యాకెట్ ఇస్తున్నారు. మిగిలా 20,244 మంది మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలకు ప్రతిరోజు ఒక కోడిగుడ్డుతో పాటు ఒక పూట పౌష్టికాహారం అందజేస్తున్నారు. వారు ఇళ్లకు వెళ్లిన తర్వాత సరైన ఆహారం తీసుకోకపోవడంతో చాలా మంది పిల్లలు పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. వారిలో ఎదుగుదలను అంచనా వేయడానికి అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతి నెల కొలతలు తీస్తున్నారు. కేంద్రాల్లోని చిన్నారుల వయసుకు, ఎత్తుకు తగిన బరువు లేరని, పోషకాహార లోపం తలెత్తినట్లు సర్వేలో తేలింది. ఈలోపాన్ని అధిగమించడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతుంది.



జిల్లా వివరాలు	
అంగన్‌వాడీ కేంద్రాలు	1,076
విద్యార్థుల సంఖ్య	50,030
ఏడు నుంచి మూడేళ్లలోపు పిల్లలు	29,786
మూడు నుంచి ఆరేళ్లలోపు వారు	20,244

కొత్త మెనూ ప్రకారం

కేంద్రాల్లో కొత్త మెనూ అమలులోకి వస్తే మూడు నుంచి ఆరేళ్ల లోపు పిల్లలకు ప్రస్తుతం ఇస్తున్న పౌష్టికాహారానికి తోడు ఉదయం అల్పాహారంగా ఉప్మా, వంద మి.లీ. పాలు ఇవ్వనున్నారు. దీంతో చిన్నారుల్లో పోషకాహార లోపం అధిగమించే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. కొత్త మెనూ అమలైతే వారిలో రోగ నిరోధక శక్తి పెరగడంతో పాటు కంటి చూపు మెరుగుపడుతుంది. రక్త హీనతను నివారించడంతో పాటు శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదపడనుంది.

అదనంగా అల్పాహారం



మూడేళ్ల నుంచి ఆరేళ్ల లోపు అంగన్‌వాడీ చిన్నారులకు ప్రస్తుతం ఇస్తున్న పౌష్టికాహారానికి తోడు అదనంగా అల్పాహారం ఇచ్చే విషయమై ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. ఇది అమలైతే పిల్లలకు వరం. ఒక్కో విద్యార్థికి వంద మి.లీ. పాలు, ఉప్మా ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచిస్తుంది.

– హైమావతి, జిల్లా సంక్షేమాధికారిణి

క్లుప్తంగా

కేసీఆర్ సతీమణి పూజలు



వరదరాజస్వామి ఆలయంలో శోభ, చిత్రంలో మాజీ సర్పంచ్ ప్రవీణ్

మర్కుక్(గజ్వేల్): సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం వర్దరాజ్‌పూర్‌లోని వరదరాజుల స్వామి ఆలయంలో మాజీ సీఎం కేసీఆర్ సతీమణి శోభ ప్రత్యేక పూజలు నిర్వహించారు. నీలా భూదేవి అమ్మవారి జన్మదినం పురస్కరించుకొని సోమవారం ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టువస్త్రాలను సమర్పించారు. శోభకు ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ, పురోహితులు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అప్పాల ప్రవీణ్, పురోహితులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లు అప్పగింత

- రూ.3.30లక్షల విలువైన ఫోన్లు రివకరీ

గజ్వేల్ : గజ్వేల్ డివిజన్ పరిధిలో పలువురు పోగొట్టుకున్న, దొంగిలించబడిన రూ.3.30లక్షల విలువైన 28సెల్‌ఫోన్లను సీఈఐఆర్(సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిష్టర్) టెక్నాలజీ ద్వారా పోలీసులు రికవరీ చేశారు. సోమవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏసీపీ నర్సింహులు బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్ పోతే టెన్షన్ పడవద్దని, వెంటనే సీఈఐఆర్‌లో వివరాలను నమోదు చేసుకుంటే త్వరగా ఫోన్ దొరికే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, గౌరారం ఎస్‌ఐ కర్ణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు దహనం



దహనమైన ద్విచక్రవాహనాలు

నారాయణఖేడ్: రెండు బైక్‌లను గుర్తుతెలియని వ్యక్తులు తగులబెట్టారు. బాధితుల వివరాల ప్రకారం.. ఖేడ్ పట్టణంలోని దత్తాత్రి కాలనీకి చెందిన మోహన్, శ్రీకాంత్, మధుల ఇళ్లు పక్కపక్కనే ఉన్నాయి. ఆదివారం రాత్రి తమ ఇళ్లముందు ద్విచక్ర వాహనాలను పార్కు చేశారు. అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పటించడంతో మోహన్, శ్రీకాంత్‌లకు చెందిన వాహనాలు పూర్తిగా కాలిపోయాయి. దహనమైన వాహనాల్లో పెట్రోలు ఉండటంతో కాలిపోయాయి. మధు వాహనంలో పెట్రోలు లేకపోవడంతో నిప్పంటుకోలేదని, దీంతో పొదల్లోకి నెట్టేసినట్లు భావిస్తున్నారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

చేర్యాల(సిద్దిపేట): విద్యుదాఘాతానికి గురై ఆవు మృతి చెందింది. ఈ ఘటన మండల పరిధిలోని చిట్యాలలో సోమవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన వంకాయల ఓజయ్య తన ఆవును రోజు వారి లాగే భావి వద్ద తీసుకెళ్లి మేపుతుండగా విద్యుత్ షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందింది. సుమారు రూ.60వేల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

పాముకాటుతో వృద్ధురాలి మృతి

చిలప్‌చెడ్(నర్సాపూర్): పాముకాటుతో ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని చండూర్ గ్రామంలో సోమవారం జరిగింది. ఎస్‌ఐ నర్సింహులు వివరాల ప్రకారం ... గ్రామానికి చెందిన ఊట్ల సత్తమ్మ(75) ఇంట్లో నిద్రిస్తుండగా, తెల్లవారుజామున ఆమె కాలుకు పాము కరిచింది. గమనించిన ఆమె తన కుమారుడు దత్తయ్యకు తెలుపగా వెంటనే జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సత్తమ్మ మృతిచెందింది.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ ఫామ్ ల్యాండ్ తక్కువ ధర 1గుంట(121చ.గ.) కే।। 3,50,000/- చేర్యాల మం।। 100Ft రోడ్ ఫేస్, స్పాట్ Reg, లైఫ్ టైం ఫ్రీ మెయింటెనెన్స్. ఫోన్: 9642068054, 6309378299 [SCA25006742]

WANTED

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ : 18K. Ph: 9848571888, 9640400073 [SCA25006687]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బందీ అయిన బాల్యం!

ఫలించని ఆపరేషన్‌లు

- మారని తల్లిదండ్రులు, యజమానులు
- యేటా పెరుగుతున్న బాల కార్మికులు
- 99 మందికి విముక్తి..54 కేసులు నమోదు



బాలుడితోపాటు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

మెదక్ కలెక్టరేట్: బడిలో చదువుకుంటూ సరదాగా గడపాల్సిన చిన్నారుల బాల్యం పనుల్లో బందీ అవుతోంది. జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై ప్రతియేటా ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ పేరిట ఆరు నెలలకోసారి అధికార బృందం తనిఖీలు చేస్తుంది. కానీ తల్లిదండ్రులు, యజమానులు, విద్యార్థుల్లో మార్పు రావడం లేదు. ఫలితంగా బాల కార్మికుల సంఖ్య పెరుగుతూనే ఉంది. పేద ప్రజలు తమ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా పిల్లలను పనుల్లో పెడుతుండగా, తక్కువ జీతం, ఎక్కువ గంటలు పనిచేయిస్తూ యజమానులు శ్రమదోపిడీకి పాల్పడుతున్నారు. పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి కేసులు పెడుతున్నారు. అయినా క్షేత్రస్థాయిలో చైతన్యం వచ్చే వరకు ఫలితం కానరాదని సమాజ సేవకులు వాపోతున్నారు.



ఆర్థిక సమస్యే ప్రధాన కారణం

బడీడు పిల్లలు బడిలో కాకుండా బాల కార్మికులుగా మారడానికి ఆర్థిక సమస్యలే ప్రధాన కారణం. తల్లిదండ్రులు లేని పిల్లలు, చదువుకునే ఆర్థిక స్తోమత లేని వారు కొందరైతే.. అమ్మనాన్నల అనారోగ్యం దృష్ట్యా ఆర్థికంగా అండగా ఉండేందుకు పిల్లలు బాల కార్మికులుగా మారుతున్నారు. చదువులో ఫెయిలైన విద్యార్థులు, చదువుపై ఆసక్తి లేని వారు సైతం బాల కార్మికులుగా మారి వెట్టిచాకిరీ చేస్తున్నారు.

రెండేళ్లుగా కార్మికులు ఇలా..

సంవత్సరం	పట్టుబడిన బాలలు	కేసులు
2024 జనవరి (ఆపరేషన్ స్మైల్)	118	27
2024 జూలై (ఆపరేషన్ ముస్కాన్)	46	1
2025 జనవరి (ఆపరేషన్ స్మైల్)	122	25
2025 జూలై (ఆపరేషన్ ముస్కాన్)	99	54

పిల్లలను ప్రోత్సహించాలి



ఈ నెల 1న చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్‌లో ఇప్పటి వరకు 99 మంది బాల కార్మికులను గుర్తించి వారికి విముక్తి కల్పించాం. అలాగే జిల్లా వ్యాప్తంగా 54 కేసులు నమోదు చేశాం. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన జరగాలంటే ముఖ్యంగా తల్లిదండ్రులు, సంరక్షకులు, యజమానుల్లో మార్పు రావాలి. బడీడు పిల్లలను బడికి వెళ్లేలా ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన పిల్లలే అత్యధికంగా ఉన్నారు. ఎవరైనా బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే రూ.20వేల జరిమానాతోపాటు కేసు కూడా నమోదవుతుంది. ఈనెలాఖరు వరకు ఆపరేషన్ ముస్కాన్ కొనసాగుతుంది.

– కరుణశీల, బాలల సంరక్షణ అధికారి, మెదక్

తీర్థయాత్రలకు వెళ్లి.. తిరిగి రాని లోకాలకు..

- చిత్తూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చేర్యాల యువకుడు మృతి
- నలుగురికి గాయాలు



బొడ్డు భరత్

చేర్యాల(సిద్దిపేట): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ... పట్టణ కేంద్రానికి చెందిన బొడ్డు గౌరీనాథ్‌కు ఇద్దరు కుమారులు, చిన్న కుమారుడు బొడ్డు భరత్(20)హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతూ హాస్టల్‌లో ఉంటున్నాడు. శుక్రవారం తన మిత్రులతో కలిసి కారులో అరుణాచలం వెళ్లాడు. అరుణాచలం గిరి ప్రదక్షిణ, దర్శనం అనంతరం అక్కడి నుంచి తిరుపతికి బయలుదేరారు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి ఆంధ్రప్రదేశ్, చిత్తూరు సమీపంలోకి రాగానే కారు టైర్ పంక్చర్ కావడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి పల్టీలు కొట్టింది. దీంతో డ్రైవింగ్ చేస్తున్న భరత్ కారులో నుంచి బయటపడ్డాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ భరత్ అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఉన్న మిగతా నలుగురు గాయపడగా వారిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. భరత్ మృతదేహం చిత్తూరు ఆస్పత్రిలో ఉంది. తాను ట్రైన్‌లో అరుణాచలం, తిరుపతికి వెళుతున్నానని, అమ్మానాన్నకి చెప్పిన భరత్ కారు ప్రమాదంలో మృతి చెందడంతో కన్నీరు మున్నీరయ్యారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, మిత్రులు అంతా శోకసంద్రంలో మునిగిపోయారు.

బైక్ అదుపుతప్పి కిందపడటంతో..

జహీరాబాద్ టౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని చిన్న హైదరాబాద్ గ్రామ శివారులో జరిగింది. రూరల్ ఎస్‌ఐ.కాశీనాథ్ వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన రేజింతల్ అంజన్న(34) మండలంలోని గోవింద్‌పూర్ వద్ద గల వ్యవసాయ క్షేత్రంలో పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి పనులు ముగించుకుని ఇంటికి బైక్‌పై వస్తుండగా అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య నందిని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి ..కారు పల్టీ

- ప్రమాదంలో ఒకరు మృతి
- ఇద్దరికి గాయాలు



విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి పల్టీ కొట్టిన కారు

చిన్నశంకరంపేట(మెదక్): విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొట్టడంతో పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన మండల కేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ నారాయణగౌడ్ కథనం మేరకు...చేగుంట మండలం పొలంపల్లి గ్రామానికి చెందిన కర్రె రాములు కుమారుడు జశ్వంత్(18) తన మిత్రులు చిన్నశంకరంపేట మండలంలోని చాకలి రాము, మాసాయిపేట మండలం అచ్చంపేట గ్రామానికి చెందిన మత్తడి రమేశ్‌లు చిన్నశివనూర్‌కు చెందిన మహేశ్‌కు చెందిన టీఎస్10ఈబీ 6336 కారును తీసుకుని ఆదివారం మెదక్‌లో దావత్ కోసం వెళ్లారు. తిరిగి అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఇంటికి వస్తుండగా చిన్నశంకరంపేటలోని ఇండియన్ పెట్రోల్ బంక్ ఎదురుగా రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొట్టడంతో పల్టీలు కొట్టింది. ఎయిర్ బెలూన్స్ తెరుచుకోవడంతో కారు డ్రైవ్ చేస్తున్న రమేశ్, ముందు సీటులో కూర్చున్న రాము తీవ్రగాయాలతో బయటపడ్డారు. వీరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇందులో రమేశ్ పరిస్థితి విషమంగా ఉండగా, వెనక సీటులో కూర్చున్న జశ్వంత్ తలకు తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



జశ్వంత్

'మంజీరా'లో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



శాయిబాజ్ మృతదేహం

పాపన్నపేట(మెదక్): మంజీరా నదిలో గల్లంతైన శాయిబాజ్ (26) మృతదేహం ఎట్టకేలకు సోమవారం సాయంత్రం దొరికింది. మిత్రులతో కలిసి చేపల వేటకు వెళ్లిన బాచారం గ్రామానికి చెందిన శాయిబాజ్ ఆదివారం ముద్దాపూర్ బ్రిడ్జి కింద గల్లంతయ్యాడు. అతని తండ్రి గౌస్ పాషా ఫిర్యాదు మేరకు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తన బృందాలతో కలిసి వెతికినప్పటికీ ఆచూకి లభించలేదు. దీంతో సోమవారం ఎన్‌డీఆర్‌ఎఫ్, ఫైర్, పోలీస్, రెవెన్యు అధికారులు తమ బృందాలతో ఎయిర్ బోట్‌లు, స్కానర్‌లతో కలిసి గాలించారు. మంజీరా నది వెడల్పు 400 మీటర్లు, లోతు 30 నుంచి 40 ఫీట్లు ఉండటంతో గాలింపు చర్యలు సత్ఫలితం ఇవ్వలేదు. ఎట్టకేలకు సాయంత్రం బ్రిడ్జికి 30 మీటర్ల దూరంలో మృతదేహం లభించింది. పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా తమ కొడుకు మృతి పట్ల వెంట వెళ్లిన అతని మిత్రులపై అనుమానం ఉందని గౌస్‌పాషా ఆరోపించారు.

మార్కెట్‌కు టమాటా



ట్రాక్టర్‌పై టమాటాలు తరలిస్తున్న రైతు

సంగారెడ్డి పాత బస్టాండ్ గంజ్ మైదాన్ ఆవరణలో ప్రతి సోమవారం కూరగాయల మార్కెట్ నిర్వహిస్తారు. సంగారెడ్డి చుట్టు పక్కల గ్రామాలతో పాటు, జహీరాబాద్, శంకర్‌పల్లి, వికారాబాద్, సింగూర్‌ల నుంచి కూరగాయలు తెచ్చి విక్రయిస్తున్నారు. సోమవారం ఓ రైతు తన పొలంలో పండిన టమాటాలను ట్రేలలో నింపి ట్రాక్టర్ వెనుక నాగలిపై తాళ్లతో గట్టిగా బిగించాడు. కలెక్టరేట్ ముందు నుంచి వెళ్తుండగా 'సాక్షి' క్లిక్ మనిపించింది.

– సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

లంచం అడిగిన డీపీవోపై ఫిర్యాదు

పటాన్‌చెరు టౌన్: తనను విధుల్లోకి తీసుకోవాలంటే ఓ అధికారి రెండు లక్షల లంచం అడిగాడని సంగారెడ్డి కలెక్టరేట్‌లో వ్యక్తి సోమవారం ఫిర్యాదు చేశాడు. పటాన్‌చెరు మండలం భానూర్ గ్రామ పంచాయతీ పూర్వ కారోబార్ పాండు గౌడ్ విలేకరులతో మాట్లాడుతూ... తాను గ్రామ పంచాయతీలో 2013 వరకు కారోబార్‌గా విధులు నిర్వహించానని చెప్పాడు. తన భార్య అప్పట్లో ఎంపీటీసీగా బరిలో నిలబడటం ఓర్వలేక తనపై అప్పటి జిల్లా అధికారులకు, గ్రామ నాయకులకు ఫిర్యాదు చేయడంతో తనను విధుల నుంచి తొలగించారన్నారు. తాను హైకోర్టుకు వెళ్లి రిట్ పిటిషన్ నెం. 20755 ఆఫ్ 2019 ద్వారా విధులు నిర్వహించుకునేలా డీపీవోకు కోర్టు ఆదేశాలు ఇచ్చిందని వివరించారు. అప్పటి డీపీవో తనకు జాయినింగ్ ఆర్డర్ ఇస్తే నాటి సర్పంచ్ జాయిన్ కానివ్వలేదన్నారు. 2024 డిసెంబర్‌లో తిరిగి జాయిన్ చేయాలని ఆర్డర్ తెచ్చుకున్నానని తెలిపారు. విధుల్లో చేరేందుకు పర్మిషన్ ఇవ్వాలని సంగారెడ్డి డీపీవోను ఎన్నిసార్లు కోరినా నిర్లక్ష్యం ప్రదర్శించాడన్నారు. చివరికి ఓ వ్యక్తి పేరు చెప్పి అతడిని కలవాలని డీపీవో సూచించారని చెప్పాడు. డీపీవో కార్యాలయ సిబ్బంది ఓ వ్యక్తిని పంపించి రూ. 2 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేయించారని ఆరోపించారు. తాను రూ.లక్ష వరకు ఇస్తానని చెప్పానన్నారు. డీపీవో లంచ గొండితనంతో విసిగిపోయి ప్రజావాణిలో ఫిర్యాదు చేశానన్నారు. ఫిర్యాదుపై కలెక్టర్ విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని కోరారు.

బురద పొలంలో పడి రైతు మృతి



భిక్షపతి

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రమాదవశాత్తు కాలు జారి బురద పొలంలో పడి రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రమైన మిరుదొడ్డిలో జరిగింది. ఎస్‌ఐ సమత వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన చెక్క భిక్షపతి (38) వ్యవసాయం చేసుకుంటూ భార్య బాలమణి, ఇద్దరు కొడుకులు, ఒక కూతురుతో పాటు, తల్లి బాలమ్మను పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో పనులు చేసుకోవడానికి పొలం ఒడ్డుపై నడుస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి బురద పొలంలో పడిపోయాడు. బురదలో తల కూరుకు పోవడంతో ఊపిరాడక అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన పరిసర ప్రాంత రైతులు హుటాహుటిన దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చేపల కోసం వెళ్లి యువకుడు..



ప్రవీణ్ మృతదేహం

తూప్రాన్: ప్రమాదవశాత్తు యువకుడు చెరువులో పడి మృతి చెందాడు. ఈ ఘటన పట్టణ పరిధిలోని అల్లాపూర్ పెద్ద చెరువు వద్ద జరిగింది. ఎస్‌ఐ శివానందం వివరాల ప్రకారం... పాపన్నపేట మండలం నార్సింగికి చెందిన టంటం ప్రవీణ్(30) కొంత కాలంగా పట్టణంలోని గీతారెడ్డి కాలనీలో భార్యాపిల్లలతో నివాసం ఉంటున్నాడు. అడ్డా కూలీగా పనిచేస్తున్నాడు. సోమవారం అడ్డాపై పని దొరకకపోవడంతో చేపలు పట్టేందుకు అల్లాపూర్ శివారులోని తిమ్మాయ చెరువు వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో చెరువులో పడి గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు గజఈతగాళ్ల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతునికి భార్య లలిత, బాబు, పాప ఉన్నారు.

భూ తగాదాలతో.. మనస్తాపానికి గురై..



మల్లేశ్ మృతదేహం

గజ్వేల్‌రూరల్: ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సోమవారం గజ్వేల్ పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌కు చెందిన శ్రీరాం మల్లేశ్(59) కుటుంబ సభ్యులకు పట్టణంలోని లక్ష్మీప్రసన్నకాలనీలో గల భూమి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపానికి గురైన మల్లేష్ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా వారు వచ్చి మల్లేశ్‌ను గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మల్లేశ్ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మృత శిశువు ఘటనపై విచారణ

- వెలుగులోకి రానున్న నిజాలు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల పరిధిలోని కేశనాయక్‌తండా గ్రామ పరిధిలోని లచ్చానాయక్‌తండా పక్కనే ఉన్న వాగులో నవజాత శిశువు మృతదేహం లభించిన ఘటన తెలిసిందే. అందులో భాగంగా సోమవారం ఈ ఘటనపై ఎస్‌ఐ చాతరాజు ప్రశాంత్ అధ్వర్యంలో పోలీసులు అన్ని కోణల్లో విచారణను వేగవంతం చేశారు. ఈ సందర్భంగా పరిసర గ్రామాలకు చెందిన వారెవరైనా మృతదేహన్ని తీసుకొవచ్చి పడేశారా? లేదా ఇతర ప్రాంతాలకు చెందిన వారెవరైనా ఇక్కడికి తెచ్చి పడేసి వెళ్లారా? అవాంచిత గర్భం దాల్చిన మహిళ గర్భ స్రావం చేయించుకొని ఇక్కడ పడేశారా? అని పలు కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయంపై ఎస్‌ఐ ప్రశాంత్‌ను సాక్షి సంప్రదించగా వాగులో నవజాత శిశువు మృతదేహం లభ్యంపై విచారణ చేపడుతున్నామని తెలిపారు.

మందు బాబులకు జరిమానా

సంగారెడ్డి క్రైమ్ : డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. ఈ ఘటన సంగారెడ్డి పట్టణ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ రామకష్ణారెడ్డి కథనం ప్రకారం... ఆదివారం అర్ధరాత్రి పట్టణంలోని పాత బస్టాండ్, పోతిరెడ్డిపల్లి చౌరస్తా, బైపాస్‌లోని గుర్రం బొమ్మ వద్ద నిర్వహించిన తనిఖీల్లో 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారిని సోమవారం కోర్టులో హాజరుపరచగా జిల్లా అదనపు న్యాయమూర్తి షకీల్ అహ్మద్ సిద్దిఖీ ఐదు మందికి రూ.2వేలు, ముగ్గురికి రూ.1500, మిగతా నలుగురికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు.

గోవా మద్యం బాటిళ్ల స్వాధీనం



పోలీసులు పట్టుకున్న మద్యం బాటిళ్లతో నిందితుడు

జహీరాబాద్ టౌన్ / మునిపల్లి(అందోల్): గోవా నుంచి అక్రమంగా తీసుకువస్తున్న మద్యం బాటిళ్లను జిల్లా టాస్క్‌ఫోర్స్(డీటీఎఫ్) టీం సభ్యులు పట్టుకున్నారు. సోమవారం మండలంలోని చిరాగ్‌పల్లి చెక్‌పోస్టు వద్ద డీటీఎఫ్ సీఐ శంకర్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందన యశ్వంత్‌రెడ్డి తన కారులో వివిధ బ్రాండ్స్‌కు చెందిన 162 మద్యం బాటిళ్లు తీసుకొస్తుండగా పట్టుకున్నారు. అతడ్ని అరెస్టు చేసి మద్యం బాటిళ్లతో పాటు కారును స్వాధీనం చేసుకుని ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. తనిఖీల్లో ఎస్‌ఐలు హనుమంతు, అనుదీప్, రామేష్, మురళీ, ఉమారాణి ఉన్నారు.

వెనుకనుంచి కారు.. ముందు నుంచి లారీ ఢీ

ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు మృతి

పటాన్‌చెరు టౌన్: ద్విచక్ర వాహనాన్ని రెండు వాహనాలు ఢీ కొట్టడంతో వ్యక్తి మృతి చెందాడు.ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మండలంలోని బచ్చుగూడెం గ్రామానికి చెందిన రాంరెడ్డి (54) పటాన్‌చెరు శివారులో ఉన్న ఓ భవన నిర్మాణ సంస్థ వద్ద వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం ఇంటి నుంచి విధులకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా క్రికెట్ శిక్షణ కేంద్రం సమీపంలో వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. అనంతరం అజాగ్రత్తగా అతివేగంగా వస్తున్న లారీ ముందు నుంచి ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలై అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది.

వృత్తి నటన.. ప్రవృత్తి దొంగతనం

చైన్ స్నాచింగ్ కేసులో నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రమేష్

సంగారెడ్డి క్రైమ్ : మహిళ మెడలోంచి మంగళ సూత్రం ఎత్తుకెళ్లిన నిందితులను అరెస్టు చేసి బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సోమవారం సంగారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐ రమేష్ కేసు వివరాలు వెల్లడించారు. రేగోడు మండలానికి చెందిన గోరం అనీల్(25),గోరం సునీల్ (23) ఇద్దరు అన్నదమ్ములు. పటాన్‌చెరువులోని గౌతమ్ నగర్‌లో అద్దెకు ఉంటూ సినిమాల్లో జూనియర్ ఆర్టిస్టులుగా జీవనం కొనసాగిస్తున్నారు. పట్టణంలోని అయ్యప్ప కాలనీకి చెందిన ఇందిరి లక్ష్మి ఈనెల 22న సాయంత్రం నాలుగు గంటల సమయంలో బైపాస్‌లోని రిషీ స్కూల్ నుంచి తన మనవరాలుని ఇంటికి తీసుకెళ్తుండగా, గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి మెడలోంచి బంగారాన్ని ఎత్తుకెళ్లారు. అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం పట్టణంలోని ఐబీ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా, యమహ ద్విచక్ర వాహనంపై అటుగా వచ్చిన ఇద్దరు అనుమానితులను అరెస్టు చేసి విచారించగా.. నేరం అంగీకరించారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. వీరి వద్ద నుంచి యమహ ద్విచక్ర వాహనం, ఫోన్, మూడు తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. సీఐ వెంట పట్టణ ఎస్సై రాజశేఖర్, సర్దార్,హెడ్ కానిస్టేబుల్ శ్రీకాంత్, కానిస్టేబుల్ నగేంద్రబాబు,ప్రదీప్,శివకుమార్ ఉన్నారు.

నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తులు

- 9వ,11వ తరగతుల్లో అడ్మిషన్లకు అవకాశం
- సెప్టెంబర్ 23 వరకు దరఖాస్తుల స్వీకరణ
- వచ్చే ఏడాది ఫిబ్రవరి 7న ఎంట్రెన్స్ పరీక్ష



వర్గల్ నవోదయ విద్యాలయం

వర్గల్(గజ్వేల్): ఆశ్రమ విద్యతో బాల బాలికల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వాలు బాటలు వేస్తున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లా వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయంలో 2026-27 విద్యాసంవత్సరానికి గాను 9వ,11వ తరగతులలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం నోటిఫికేషన్ వెలువడింది. అర్హులైన విద్యార్థులు ఎంట్రెన్స్ పరీక్ష రాసేందుకు సెప్టెంబర్ 23 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రాజేందర్ తెలిపారు. ఫిబ్రవరి 7న (లేటరల్ ఎంట్రీ సెలక్షన్ టెస్ట్) ఎంపిక పరీక్ష జరుగుతుందని, అందులో ప్రతిభ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందన్నారు. ఇందుకోసం ఉమ్మడి జిల్లాకు చెందిన అభ్యర్థులు www.navodaya.gov.in ద్వారా సెప్టెంబర్ 23 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకునేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పాఠశాలల యాజమాన్యాలు ప్రోత్సహించాలని కోరారు. అభ్యర్థులకు అర్హత, పరీక్ష సిలబస్ తదితర విషయాలను వివరించారు.

ఇవిగో అభ్యర్థుల అర్హతలు

- ప్రవేశం పొందే బాలబాలికలు ఉమ్మడి మెదక్ జిల్లాకు చెంది, వారి తల్లిదండ్రులు ఇక్కడే నివాసం ఉండాలి.
- 9వ తరగతిలో ప్రవేశం కోసం అభ్యర్థులు ప్రస్తుత విద్యాసంవత్సరం(2025-26)లో ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 8వ తరగతి చదువుతూ ఉండాలి. అభ్యర్థి మే 1, 2011 నుంచి జూలై 31, 2013 మధ్య జన్మించి ఉండాలి.
- 11వ తరగతిలో ప్రవేశం పొందే అభ్యర్థులు ప్రస్తుత విద్యాసంవత్సరం(2025-26)లో ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 10వ తరగతి చదువుతూ ఉండాలి. జూన్ 1, 2009 నుంచి జూలై 31, 2011 మధ్య జన్మించి ఉండాలి.

9వ తరగతి పరీక్ష సిలబస్

హిందీ, ఇంగ్లిష్, మ్యాథమేటిక్స్, సైన్స్‌కు చెందిన ప్రశ్నలు ఉంటాయి. ఓఎమ్ఆర్ ఆధారిత ఆబ్జెక్టివ్ టైప్‌లో పరీక్ష ఉంటుంది. హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ప్రశ్నపత్రం ఉంటుంది.

11వ తరగతి పరీక్ష సిలబస్

మెంటల్ ఎబిలిటీ, ఇంగ్లిష్, మ్యాథమేటిక్స్, సైన్స్, సోషల్ సైన్స్‌కు చెందిన ప్రశ్నలు ఉంటాయి. ఓఎమ్ఆర్ ఆధారిత ఆబ్జెక్టివ్ టైప్‌లో పరీక్ష ఉంటుంది. హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ప్రశ్నపత్రం ఉంటుంది. ఇతర వివరాలకు నవోదయ విద్యాలయ సమితి నోటిఫికేషన్‌లో చూడొచ్చు.